క్లుప్తంగా

గురుకుల కాలేజీలో సీటు సాధించిన విద్యార్థి


హరీష్

టేకులపల్లి: టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తి చేసిన శాగంటి హరీశ్ టీఎస్ఆర్జేసీ ప్రవేశ పరీక్షలో ప్రతిభను చూపింది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెరుగు శ్రీనివాస్ మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (టీఎస్ఆర్జేసీ) ప్రవేశ పరీక్షలో హరీశ్ ప్రతిభను కనబరిచి ఏన్కూరు కాలేజీలో ఇంటర్ బైపీసీ గ్రూపులో సీటు సాధించాడని తెలిపారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం వీరిది. హరీష్ తండ్రి రామయ్య కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. తల్లి రజిత కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది.

వెంకట్రావు మృతికి సంతాపం

పాల్వంచ: పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన కాంట్రాక్టర్ చనుమోలు వెంకట్రావు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ నామా నాగేశ్వరరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, కిలారు నాగేశ్వరరావు, నల్లమల్ల వేణు తదితరులు ఉన్నారు.

జేకే స్కూల్ మైదానం పరిశీలన

ఇల్లెందు: పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌ను ఏరియా జీఎం జాన్ ఆనంద్ సందర్శించి పరిశీలించారు. గ్రౌండ్‌లో జరుగుతున్న వాకింగ్ ట్రాక్ పనులను పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రౌండ్‌లో పార్క్ ఏర్పాటు కోసం స్థలం పరిశీలించారు. జీఎం వెంట సింగరేణి అధికారులు జీవీ మోహన్ రావు, రవికుమార్, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న కొత్వాల

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగునందు శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమం, రుద్ర హోమం, శాంతి హోమం, బలిపూజలు చేశారు. బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, దేవాలయ కమిటీ సభ్యులు భట్టు మురళీ నాయక్, వీరనాయక్, లక్ష్మణ్, జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, బద్ది కిశోర్, పులి సత్యనారాయణ, మధు, గిరిప్రసాద్, దారా చిరంజీవి, శాంతివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త!

- ఆఫర్లు చూసి మోసపోవద్దు
- బిల్లులు భద్రపరుచుకోవాలి
- రైతులకు అధికారుల సూచనలు..




దుకాణంలో విత్తనాలను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

పాల్వంచరూరల్: వానాకాలం సమీపిస్తోంది. రైతులు పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే అన్నదాత ఆది నుంచే అప్రమత్తంగా ఉండాలి. దుక్కులు దున్నడం దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు అన్ని జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుత సీజన్‌లో రైతులు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ సమయంలో రైతులు ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండరాదు. విత్తన ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి లేకపోతే మొదటికే మోసం వస్తుంది. నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని వ్యవసాయ, పోలీసుశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఊరుపేరులేని కంపెనీలు...

ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో నాణ్యత లేని, ఊరూ పేరూ లేని రకరకాల విత్తనాలను కొంతమంది సీజన్‌లో ప్రచారం చేసి రైతులకు అంటగంటి మోసం చేస్తున్నారు. అధిక దిగుబడి ఇస్తుందంటూ కొత్తరకం అంటూ మాయమాటలతో, ప్రకటనలతో నిరక్షరాస్యులైన గిరిజన రైతులను ఆకట్టుకుని నకిలీ విత్తనాలను విక్రయించి ప్రతీ సంవత్సరం రైతులను మోసం చేస్తున్నారు. రైతులు కూడా నకిలీ విత్తనాలను విక్రయించే వారి మాయమాటలు నమ్మి మోసపోతున్నారు.

గతంలో నకిలీ విత్తనాల బారిన పడిన రైతులు...

మండలంలో అనేకమంది రైతులు గతంలో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోయిన సందర్భాలు ఉన్నాయి. పాండురంగాపురంలో నకిలీ మిర్చి విత్తనాలు కొనుగోలు చేసి పలువురు రైతులు నష్టపోయారు. అదేవిధంగా సూరారం, జగన్నాథపురం, కోడిపుంజుల వాగులో నాణ్యత లేని వరివిత్తనాలను కొనుగోలు చేసి మోసపోయారు. తాజాగా కోడిపుంజుల వాగులోని పలువురు రైతులు కొత్తరకం వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు దిగుబడి రాక నష్టపోయారు. బాధిత రైతులు విత్తనాలు విక్రయించిన పాల్వంచలోని వ్యాపారి దుకాణం ఎదుట ఆందోళన చేసి పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తక్కువ ధరలు, ఆఫర్లు అంటూ కొంతమంది డీలర్లు ఆఫర్ల కోసం నాణ్యత లేని విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. వారి మాటలను నమ్మి మోసపోవద్దు. చిన్నచిన్న జాగ్రత్తలు పాటిస్తే నకిలీ విత్తనాల బారిన పడకుండా ఉండవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు కొనుగోలు చేసే ముందు...

రైతులు విత్తనాలను కొనుగోలు చేసేముందు వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్ నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలి. సీల్ చేసిన బస్తాలను, ధ్రువీకరణ ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. విత్తన ప్యాకెట్లపైన గడువు తేదీ, రకం పేరు, ల్యాబ్ నంబర్లను చూసుకోవాలి. కొనుగోలు బిల్లుతోపాటు విత్తనరకం, గడువు తేదీ ఉండేలా డీలర్ సంతకంతో కూడిన రశీదు మాత్రమే తీసుకోవాలి. కొనుగోలు చేసిన రైతు సంతకం కూడా బిల్లుపై ఉండేలా చూసుకోవాలి.

రైతులకు అవగాహన ఉండాలి



విత్తనాలపై రైతులకు అవగాహన ఉండాలి. ప్యాకెట్లలో ఉన్న విత్తనాలు ఎంత శాతం మొలకేత్తుతాయో చూసుకోవాలి. రశీదులు, ప్యాకెట్లను భద్రపరుచుకోవాలి. అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేస్తేనే అధిక దిగుబడులు వస్తాయి. గ్రామాల్లో తిరుగుతూ విత్తన ప్యాకెట్లు బుక్ చేస్తుంటారు. వాటికి దూరంగా ఉండాలి. ఫొటోలు చూపించి, ఆఫర్ల ఆశ చూపి అంటగడుతుంటారు. నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– శంకర్, మండల వ్యవసాయశాఖ అధికారి

ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వండి..


మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

కొత్తగూడెంరూరల్: పట్టభద్రులు తనకు ఒక అవకాశమివ్వాలని నల్లగొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న కోరారు. కొత్తగూడెంలో మంగళవారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తీరుతోనే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వచ్చిందని, మళ్లీ ఇప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరడం ఎంత వరకు సమంజసమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ తాను మంచివాడిని కాదని ప్రచారం చేస్తుండగా, బీజేపీ అభ్యర్థి ఎవరికీ తెలియదని పేర్కొన్నారు. కాగా, తాను 200 మంది చిన్నారులకు ఆపరేషన్ చేయించానని, అనేక మంది పేద పిల్లలను చదివిస్తున్నానని పట్టభద్రులు ఆశీర్వదిస్తే చట్ట సభలకు వెళ్తానని తెలిపారు. తొలుత ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడారు. ఈ సమావేశంలో కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్వాల శ్రీనివాస్, తుళ్లూరి బ్రహ్మయ్య, సాబీర్‌పాషా, నాగసీతారాములు, కోనేరు సత్యనారాయణ, ఎడవల్లి కృష్ణ, ఏనుగుల అర్జున్‌రావు, తూము చౌదరి, ఆళ్ల మురళి, రాయల శాంతయ్య, ఊకంటి గోపాల్‌రావు, అంతోటి పాల్, సుందర్‌లాల్ కోరి, బాలప్రసాద్, చీకటి కార్తీక్, ఫైజుద్దీన్, పాల సత్యనారాయణరెడ్డి, విప్లవ్‌రెడ్డి, సోమిరెడ్డి, ఎం.ఏ.రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి...

ఇల్లెందు: వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న తమకు న్యాయం జరిగేలా చూడాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీన్మార్ మల్లన్నను కోరారు. ఖమ్మంలో ఆయనను కలిసిన ఉద్యోగులు హరీష్, నజీముద్దీన్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

అన్నిరకాల ధాన్యాలకూ బోనస్ ఇవ్వాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: రైతాంగానికి అన్నిరకాల వరి ధాన్యాలకు రూ.500 బోనస్ చెల్లించాలని, అదేవిధంగా రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో సరపరా చేయాలని, రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు గుగులోతు రామచందర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుటుంబాన్ని యూనిట్‌గా కాకుండా రుణం తీసుకున్న ప్రతీ ఒక్కరికీ మాఫీ చేయాలని కోరారు. లేదంటే రైతాంగానికి ఇచ్చిన హామీ అమలుకై రైతాంగ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు ధరావత్ వెంకన్న, బానోత్ వెంకట్రాం, గుగులోతు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు/టేకులపల్లి: నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తే వ్యాపారులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. జూలూరుపాడులో మంగళవారం సీడ్స్, ఫెర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రయత్నం చేయొద్దని సూచించారు. ప్రతీ అమ్మకంపై బిల్లులు ఇవ్వాలని తెలిపారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై జీవన్ రాజు పాల్గొన్నారు. అలాగే, టేకులపల్లిలో వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ షేక్ సైదా రవూఫ్ మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు నాణ్యమైనవి, గుర్తింపు పొందిన కంపెనీలవి మాత్రమే విక్రయించాలని సూచించారు.

వరకట్న వేధింపులు

ఇల్లెందు: వరకట్న వేధింపులపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇల్లెందు భూపేష్‌నగర్‌కు చెందిన వాంకుడోతు బిందును ఆమె భర్త శ్రీకాంత్ అత్తామామలు అదనపు కట్నం కోసం వేధిస్తుండగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీ

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని స్కానింగ్ సెంటర్లలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. అలాగే, నర్సింగ్ హోంల్లో కూడా తనిఖీ చేసిన ఉద్యోగులు సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులు చేయాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చైతన్య, డిప్యూటీ డెమో ఎం.డీ.ఫయాజ్ మొహిద్దీన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచరూరల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవీందర్ తెలిపారు. యానంబైల్ సబ్‌స్టేషన్ పరిధి కిన్నెరసాని, కోడిపుంజులవాగు, పునుకుల, సత్యనారాయణపురం, రెడ్డిగూడెం, ఉల్వనూరు గ్రామాల్లో మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా ఉండదని వెల్లడించారు.

పిడుగుపాటు బాధిత రైతులను ఆదుకోండి


రైతులతో మాట్లాడుతున్న సాబీర్ పాషా

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం రేగులగూడెం గ్రామపంచాయతీ రాళ్లచెలకలో సోమవారం పిడుగుపాటుకు 13 పశువులు మృతి చెందగా.. బాధిత రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.షాబీర్‌పాషా కోరారు. ఈ సందర్భంగా రైతులను మంగళవారం ఆయన పరామర్శించి మాట్లాడారు. పశువుల మృతితో నిరుపేద గిరిజన రైతులు నష్టపోయిందున వెంటనే పరిహారం చెల్లించాలని కోరారు. కాగా, మండలంలోని ఉల్వనూరుకు చెందిన వజ్జ వాసు, పాయం నగేష్, కాలం అనిల్, పూనెం సాయి, వజ్జ కృష్ణ, కాలం నర్సింహారావు, అంబటి బాబు తదితరులు సీపీఐ చేరగా వారికి సాబీర్‌పాషా కండువాలు కప్పి ఆహ్వానించారు. ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, వేములపల్లి శ్రీనివాసరావు, లాల్‌పాషా, జకరయ్య, కంటి సత్యనారాయణ, వజ్జ నారాయణ, రామస్వామి, సమ్మయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తగూడెంరూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యాన ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సీడీపీఓ రేవతి సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కోడిగుడ్లు, ఇతర సరుకులు అందజేసి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు సూచనలు పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలకు నష్టం జరిగితే చర్యలు తప్పవు

పాల్వంచరూరల్: పొలాల్లో వ్యర్థాలను కాల్చే సమయాన రహదారి పక్కన మొక్కలు చనిపోకుండాలని చూడాలని, లేనిపక్షంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి తెలిపారు. మండలంలోని జగన్నాథపురం – నాగారం మార్గంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు కాలిపోగా, మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యాన నాటిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఆ తర్వాత నాగారం కాలనీ వద్ద ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీఓ కూలీలతో మాట్లాడారు.

ఏపీఓ పొరండ్ల రంగా, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అచ్చమ్మ, గ్రామపంచాయతీ కార్యదర్శులు సాయిరాం, సతీష్, మౌనిక, దుర్గారావు, క్షేత్రసహాయకులు శంకర్, రాములు పాల్గొన్నారు.

కొత్త గనులు ఏర్పాటు చేస్తాం..


ఓటు అభ్యర్థిస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): భారత ప్రధానమంత్రి మోదీ సారథ్యంలో సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటు చేయించి, ఈ ప్రాంత నిరుద్యోగుల ఉపాధికి తనవంతు కృషి చేస్తానని ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టబద్రుల బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయం కొత్తగూడెంలో సింగరేణి ఉద్యోగస్తులను తమ మొదటి ప్రాధాన్య ఓటును ఒకటో నంబర్‌పై వేయాలని ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ... తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదన్నారు. పల్లా రాజేశ్వరరెడ్డి రాజీనామా చేసి పట్టభద్రుల ఓటును నిర్వీర్యం చేశారని, బీఆర్ఎస్ పార్టీ మళ్లీ ఓటు అడగడం సమంజసం కాదన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలత ఓగద్దెనెక్కి ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయకుండా ఓటు అడగటం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీర సీతారామ్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, కొడగంటి రమేష్, జీవీకే మనోహర్, ఆకుల నాగేశ్వరరావు, టి.నరేంద్రబాబు, మాధవ నాయక్, పవన్ కుమార్, ఆర్ఎస్ఎస్ పిల్లి రాజేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, పైడిపాటి రవీందర్ పాల్గొన్నారు.

వ్యాపారుల కనుసన్నల్లోనే ఏజెన్సీ రైతులు

- పెట్టుబడి, ఇంటి అవసరాలు వారి చెంతనే
- ఏటా నష్టాలొస్తున్నా అదే బాటలో అన్నదాతలు
- రైతు బంధు, పంట రుణం అందినా.. కనిపించని మార్పు


నాగలితో దుక్కి దున్నుతున్న రైతు


ట్రాక్టర్‌తో దుక్కి సిద్ధం చేస్తున్న అన్నదాత

ఇల్లెందురూరల్: ఇల్లెందు ఏజెన్సీలో తరతరాలుగా పెట్టుబడిదారుల గుప్పిట్లో అన్నదాత నలిగిపోతూనే ఉన్నాడు. ప్రభుత్వం నుంచి ఎన్ని ఆర్థిక ప్రయోజనాలు అందినా హలదారి మాత్రం వ్యాపారి చెంతనే సాయం తీసుకోవడం ఏజెన్సీ పల్లెల్లో పరిపాటిగా మారింది. ఈ బలహీనతనే ఆసరాగా చేసుకొని.. ఆపదలో చేరదీసినట్లు అనుకూలంగా అప్పులిచ్చి.. అదునులో పంటలకు పెట్టుబడి పెట్టి.. వాటికి వడ్డీలకు వడ్డీలు వేసి.. కర్షకుల శ్రమనంతా దోచుకుంటున్నారు. పంటకాలం మొత్తం శ్రమించిన రైతుకు చివరకు చేతిలో చిల్లర మాత్రమే మిగులుతోంది. ఇదీ ఏజెన్సీ గ్రామాలలో తరతరాలుగా వ్యాపారుల వలలో చిక్కుకుపోయిన అన్నదాతల దయనీయ పరిస్థితి.

పెట్టుబడులు ఇస్తారిలా..

ఏజెన్సీ గ్రామాలలో కొంతమంది వ్యాపారస్తులు తమ దుకాణం పేరుతో ఖాతా పుస్తకాలు ముద్రణ చేయిస్తారు. వాటిని ఖాతాలు ఉన్న రైతులకు అందజేస్తారు. ఏటా జూన్‌లో వ్యవసాయ పనులు ప్రారంభమైనా.. కొంతమంది వ్యాపారులు ఏప్రిల్, మే నెలల్లో లారీల ద్వారా గ్రామాల్లోని రైతుల ఇళ్ల వద్దకు యూరియా, డీఏపీ, 20–20 వంటి ఎరువులను నేరుగా చేరవేస్తారు. తొలకరి సమయంలో కూరగాయలు, పత్తి, వరి, మొక్కజొన్న తదతర పంటలకు కావాల్సిన విత్తనాలు, పురుగు మందులు, నూర్పిడి పట్టాలు, వ్యవసాయ అవసరాలకు నగదు, నిత్యావసర సరుకులతోపాటు ఇతర వస్తువులు పెట్టుబడి పేరుతో ఒక్కో రైతుకు నమ్మకాన్ని బట్టి రూ.50 వేలు మొదలుకొని రూ.2 లక్షల వరకు ముందుగా అప్పు కింద ఇస్తారు.

చిట్టా మొత్తం ఖాతా పుస్తకంలోనే..

రైతుకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఇచ్చే సమయంలో వారికి ముందస్తుగా ఇచ్చిన ఖాతా పుస్తకంలో కేవలం ఏమిచ్చారు.. ఎన్ని ఇచ్చారు... వంటి వివరాలు మాత్రమే రాస్తారు. వాటికి సంబంధించిన ధరలు మాత్రం రహస్యంగా ఉంచుతారు. పండిన పంటలను సదరు వ్యాపారికి విక్రయించిన అనంతరం ప్రత్యేక పత్రంలో ఖాతా పుస్తకంలో రాసుకున్న వివరాలకు అనుగుణంగా వారికి ఇష్టమొచ్చిన విధంగా అంటే దాదాపుగా 40 శాతం అదనపు ధరలు నమోదు చేస్తారు. ఒక్కోసారి తీసుకోని విత్తనాలు, ఎరువులకు కూడా ధరలు రాసేస్తారు. ఇలా లెక్కలు చేసిన తరువాత రైతులకు నేరుగా డబ్బులు చెల్లించకుండా కొంతకాలం కాలయాపన చేస్తారు. తమ వద్ద ఉన్న మిగులు డబ్బులను రైతులకు వివిధ శుభకార్యాలకు, గృహ అవసరాలకు వస్తు రూపంలో అందజేస్తున్నారు. కొన్ని వస్తువుల ధర వెంటనే రైతులకు తెలియకుండా గోప్యంగా ఉంచుతారు. ఏ వస్తువు ఎంతకు కొన్నారో తెలియని దుస్థితి రైతులది. అంతా ఖాతా పుస్తకంలో వస్తువులతో రాస్తారు. చివరకు లెక్కలు చేసే సందర్భంలో అందిన కాడికి దోచుకుంటున్నారు.

అందినకాడికి నిలువు దోపిడీ..

రైతులు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేసే సమయంలో రవాణా, హమాలీ అవసరాలు ఉంటాయని రైతులకు మాయమాటలు చెప్పి పత్తి, వరి, మొక్కజొన్న క్వింటా ఒక్కంటికి రూ.200 నుంచి రూ.300 తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. 60 కేజీల బస్తాకు తరుగు, మొగ్గ పేరుతో అదనంగా 2, 3 కిలోలు కాజేస్తున్నారు. లారీల్లో తరలించిన అనంతరం వ్యాపారులు వేబ్రిడ్జిపై తూకం వేస్తారు. అప్పుడు వ్యాపారులకు కిలోల కొద్ది కలిసి వస్తుంది. ఆరుగాలం శ్రమించి పండిచిన రైతుకు మాత్రం చేతిలో చిల్లర మాత్రమే మిగులుతోంది.

సకాలంలో సాయం అందక..

రైతులు దళారుల చేతిలో మోసపోవద్దనే సంకల్పంతో ప్రభుత్వం పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న రైతులకు రైతుబంధు పేరుతో వానాకాలం, యాసంగి పంటలకు పెట్టుబడి అందిస్తోంది. అంతేకాకుండా బ్యాంకర్లు సైతం పట్టాదారు పాస్‌పుస్తకం కలిగి ఉన్న రైతులకు పంట రుణాలను మంజూరు చేస్తుంటారు. ఇలా అందిన సాయం కూడా రైతులను వ్యాపారుల కబంధ హస్తాల నుంచి దూరం చేయలేకపోతున్నాయి.

రైతుబంధు నిధులు సకాలంలో అందకపోవడం ఒక కారణమైతే.. అవి చేతికందిన సమయంలో వాటిని తమ సొంత అవసరాలకు వినియోగించుకోవడం వంటి కారణాలతో పెట్టుబడి కోసం రైతులు వ్యాపారులను ఆశ్రయించడం పరిపాటిగా మారింది. ఇదిలా ఉండగా పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతులు ఏజెన్సీ గ్రామాలలో అత్యధికులు ఉన్నారు. వీరికి అటు రైతు బంధు అందక, ఇటు బ్యాంకుల నుంచి రుణాలు పొందలేక విధిలేని పరిస్థితిలో వ్యాపారుల చెంతకు చేరుతున్నారు.

సకాలంలో రైతుబంధు అందక..



మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తుంటాం. తొలకరి సమయంలోనే మొక్కజొన్న విత్తుకుంటాం. వర్షాలు అనుకూలిస్తే వరినాట్లు జూలై చివరి వారంలో ప్రారంభిస్తాం. మొక్కజొన్న విత్తు దశలో రైతు బంధు అందకపోవడంతో వ్యాపారులను ఆశ్రయిస్తున్నాం. తిరిగి పంట విక్రయించిన సమయంలోనే డబ్బులు చేతికిస్తారు.

– నూనావత్ వెంకట్రాం, పోలారం

సమయానికి అప్పలిస్తారని..



ఏటా సాగు ప్రారంభ సమయంలో, ఇతర అవసరాలు ఎదురైన సందర్భాలలో అనుకూలంగా అడిగినంత అప్పులిస్తారు. రైతుబంధు, బ్యాంకు రుణాలను ఇంటి అవసరాలకు వినియోగించుకుంటాం. పంట పెట్టుబడి మొత్తం వ్యాపారి వద్దే తీసుకుంటాం. లెక్కలన్నీ వ్యాపారి వద్దే ఉంటాయి. ఏడాది చివరలో ఎంత వస్తే అంత తీసుకుంటాం.

– ధరావత్ దేవీలాల్, భద్రుతండా

శాస్త్ర, సాంకేతిక విప్లవ సృష్టికర్త రాజీవ్‌గాంధీ


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డీవీ


పాల్వంచ: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పాల్వంచ: భారతదేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం, దేశ సమగ్రత కోసం కృషి చేసినట్లు చెప్పారు. ఐటీ రంగాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, బద్ది కిశోర్, జమ్ముల సీతారాంరెడ్డి, కనగాల నారాయణ, ఎస్‌వీఆర్‌కె.ఆచార్యులు, కాల్వ భాస్కర్, సురేశ్, మధు, గిరిప్రసాద్, నరహరి, రామకృష్ణ, పులి సత్యనారాయణ, రమణ, చిరంజీవి, రమేశ్, జోషి, గంధం నర్సింహారావు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరుపాడు నవోదయ కాంప్లెక్స్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుద్దుకూరి మధుసూదన్‌రావు, మాలోత్ మంగీలాల్ నాయక్, వేల్పుల నరసింహారావు, నర్వనేని పుల్లారావు, యల్లంకి పుల్లయ్య, యల్లంకి చిన్న నాగేశ్వరరావు, సున్నా రంగారావు, లకావత్ లచ్చు నాయక్, మాచినేని సత్యనారాయణ, పురస్తారపు శ్రీను, కొండెం జోగారావు, పోతురాజు నాగరాజు, మోదుగు రామకృష్ణ, పణితి వెంకటేశ్వర్లు, మిర్యాల కిరణ్ కుమార్, దేవరకొండ కిరణ్, వాంకుడోత్ కిషన్, మర్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: భారత దేశానికి శాస్త్ర, సాంకేతిక రంగాన్ని విస్తరింపజేసిన సాంకేతిక విప్లవ సృష్టికర్త మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇల్లెందు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. దొడ్డా డానియేల్, పులి సైదులు, కల్తీ వెంకట్, రామారావు, సూర్యం పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని చల్లసముద్రం గ్రామపంచాయతీ క్యాంపు సెంటర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు చీమల వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా, ధన్‌సింగ్, వల్లాల రాజయ్య, పూనెం శ్రీరాములు, రమేష్, బుచ్చయ్య, సలీం, వీరన్న, బానోత్ శ్రీను, చాట్ల స్వామి, కర్ర రమేష్, మంగీలాల్, వీరగోని కుమార్, నల్ల శ్రీనివాస్, సీతారాములు, ఆంగోత్ హనుమ, జంకు, జయరాం, కృష్ణ, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


జూలూరుపాడులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు